సాక్షి
మంచిర్యాల
శనివారం । 7 । అక్టోబర్ । 2023



నీటికుంటలు.. నిండుకుండలు..
కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో నీటికుంటలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. వన్యప్రాణుల దాహార్తి తీర్చుతుండగా.. భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. 8లో▸

పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
తాండూర్: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఎల్‌పీవో ఫణీందర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బోయపల్లి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. పంచాయతీ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంటింటా చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలించి వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలని తెలిపారు. ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.0 /24.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అల్పాహార పథకం ప్రారంభించిన సుమన్



విద్యార్థులతో విప్, కలెక్టర్ అల్పాహారం

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వీయ పర్యవేక్షణలో తెలంగాణలోని పాఠశాలల్లో నిర్వహణ జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందజేయడంతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధిస్తూ ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నరేందర్, జిల్లా విద్యాధికారి యాదయ్య, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



కొత్తూరు పోలింగ్ కేంద్రం వద్ద ఏసీపీ

నెన్నెల: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన గుండ్లసోమారం, ఆవుడం, కొత్తూరు, జోగాపూర్, ఘన్‌పూర్‌లో పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి ఏసీపీ సదయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని ప్రజలకు వివరించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల గ్రామాలను పరిశీలించి భద్రతను కట్టుదిట్టం చేయాలని నెన్నెల ఎస్సై శ్యాంపటేల్‌ను ఆదేశించారు.

జోనల్ క్రీడా పోటీలు విజయవంతం చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రీజినల్ కోఆర్డినేటర్

చెన్నూర్: చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈ నెల 13 నుంచి 16 వరకు నిర్వహించే కాళేశ్వరం జోన్–1 తొమ్మిదో జోనల్ స్థాయి క్రీడా పోటీలు విజయవంతం చేయాలని రీజినల్ కోఆర్డినేటర్ స్వరూపారాణి అన్నారు. జోనల్ స్థాయి క్రీడా పోటీల విజయవంతానికి శుక్రవారం కళాశాలలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్వరూపారాణి మాట్లాడుతూ జోనల్ మీట్ నిర్వహణ కోసం కమిటీలు నియమించామని అన్నారు. ప్రతీ కమిటీలో ఇద్దరు డీసీవోలు, ప్రిన్సిపాల్‌లు, సీనియర్ టీచర్లు సభ్యులుగా ఉంటారని తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే పోటీలకు జోన్‌లోని 15 పాఠశాలకు చెందిన 1,275 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రాజరాణి, డీసీవో రాముల బాలభాస్కర్, పోలోజు బాలరాజు, బోథ్ ప్రిన్సిపాల్ సువర్ణలత, రమేశ్‌బాబు, ప్రేమరాణి పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణకు కృషి చేయాలి



బైసన్‌కుంట వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు

జన్నారం: వన్యప్రాణుల సంరక్షణకు అందరూ కృషి చేయాలని ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎఫ్‌డీవో మాధవరావు అన్నారు. శుక్రవారం వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌లోని గొండుగూడ, బైసన్‌కుంట ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులతో పర్యటించి, బైసన్‌కుంట వద్ద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎఫ్ఆర్వో హఫీజొద్దీన్, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రియాజొద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వర్షం.. సాధారణమే..!



కాత దశకు వచ్చిన పత్తి పంట

- వెనుదిరిగిన నైరుతి.. ఈశాన్యం కరుణిస్తే దిగుబడి
- 13 మండలాల్లో సాధారణం.. ఐదు మండలాల్లో లోటు
- పెరుగుతున్న ఎండల తీవ్రతతో పంటలకు ముప్పు
- భూగర్భ జలాలు గత ఏడాది కంటే కిందికే..

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సాగు ముగింపు దశకు చేరింది. నాలుగు నెలల నైరుతి కాలం వెనుదిరిగింది. గత కొద్ది రోజులుగా రుతుపవనాలు మందగించాయి. మరోవైపు ఎండలు దంచికొడుతున్నాయి. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదువుతందని ఆరంభంలో వాతావరణ శాఖ సూచించినట్లుగానే కొంచెం అటు ఇటుగా వర్షాలు కురిశాయి. తొలకరి వర్షాలు జూన్ మూడో వారం నుంచి మొదలయ్యాయి. జూలై రెండోవారంలో ఎడతెరిపి లేని భారీ వర్షాలతో రెట్టింపు వర్షపాతం నమోదైంది. ఆగస్టులో ఆశించిన వర్షాల్లేక లోటు వర్షపాతం నెలకొంది. సెప్టెంబర్ రెండో వారంలో భారీ వర్షాలు కురిశాయి. ఈ నాలుగు నెలల నైరుతి కాలం అన్నదాతలకు కొంత ఖేదం.. కొంత మోదం మిగిల్చి వెనుదిరిగింది. జిల్లా సాధారణ వర్షపాతం 938.4మిల్లీమీటర్లు కాగా.. 1031.3 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లా సగటున 10శాతం అధికంగా నమోదైంది. జిల్లాలోని 13మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. ఐదు మండలాల్లో లోటు నెలకొంది. జైపూర్, కోటపల్లి, కాసిపేట, దండేపల్లి, చెన్నూర్, జన్నారం మండలాల్లో కురిసిన భారీ వర్షాలతో జిల్లా సాధారణ సగటు వర్షపాతం 10శాతం అధికంగా నమోదైంది. గత ఏడాది సెప్టెంబర్ నెలాఖరు వరకు భూగర్భ జలాలు జిల్లా సగటున 2.82మీటర్ల లోతులో ఉండగా.. ఈ ఏడాది 3.14మీటర్ల లోపల ఉన్నాయి. భూగర్భ జలమట్టం 0.32శాతం కిందికి పడిపోయింది.

పగలు ఎండ.. రాత్రి చలి

రుతు పవనాలు వెనుదిరగడంతో గరిష్ట ఉష్ణోగ్రతలు గత నాలుగు రోజులుగా 37డిగ్రీలకు చేరుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు మండుతుండగా.. రాత్రి మంచు ప్రభావంతో చలి తీవ్రత పెరుగుతోంది. గత వారం రోజులుగా మారిన వాతావరణ పరిస్థితులతో ఆలస్యంగా ఆగస్టు నెలాఖరులో వరి నాట్లు వేసుకున్న రైతులు పంట ఎదిగే దశలో నీటి తడులకు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులు కాలువలు, చెరువులు, బోర్ల ద్వారా నీటిసాకర్యం లేని రైతులు ఈశాన్య రుతుపవనాలు, అకాల వర్షాలపై ఆశలు పెట్టుకున్నారు.

కీలక సమయంలో ముఖం చాటేసిన వానలు

ఆగస్టులో చిరుజల్లులకే పరిమితం కాగా ఆశించిన వర్షాలు లేక నాట్లు వేసుకోలేదు. నీటి సౌకర్యం ఉన్న రైతులు కొంత మేర నాట్లు వేసుకోగా.. సెప్టెంబర్ 10 నుంచి 20 మధ్యలో కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాలకు వరి నాట్లు వేసుకున్నారు. ఇదే నెలలో 26నుంచి 29వరకు కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించి చెరువులు, కుంటలు నిండాయి. పత్తి, వరి పంటలు నీట మునిగాయి. వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. వర్షాలకు అనుకూలమైన సెప్టెంబర్‌తో నైరుతి కాలం ముగిసింది. ఆలస్యంగా నాట్లు వేసుకున్న పంటలపై రైతులకు భరోసా కొరవడుతోంది. అక్టోబర్‌లో ఈశాన్య రుతు పవనాలు, అకాల వర్షాలు, పెను తుపానులతో వరుణుడు కరుణిస్తే పంటల దిగుబడి వస్తుంది. ఈ నెలలో ఎండలు ఇలాగే కొనసాగితే పంట చేతికందే అవకాశం లేదు.

3.13 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో గత ఏడాది వానాకాలంలో 3.27 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా.. ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 3.65 లక్షల ఎకరాలు ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. పత్తి గత ఏడాది 1.65లక్షల ఎకరాల్లో సాగు కాగా.. ఈ ఏడాది 1.90లక్షల ఎకరాలు సాగవుతుందని అంచనా వేశారు. కానీ 1,54,881.3 ఎకరాలకే పరిమితమైంది. వరి గత ఏడాది 1.60లక్షల ఎకరాల్లో సాగు కాగా.. ఈ ఏడాది 1,57,081.3 ఎకరాల్లో సాగైంది. పప్పు దినుసులు, ఇతర పంటలు 10,500 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేయగా.. 1,705.5 ఎకరాలకే పరిమితమైంది. మొత్తంగా సాగు విస్తీర్ణం తగ్గి 3.13లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. జిల్లాలో ప్రధానంగా పత్తి పంట సాగు తగ్గడం గమనార్హం. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలతో వరి సాగు విస్తీర్ణం పెరుగగా.. పప్పుదినుసులపై రైతులు ఆసక్తి చూపలేదు. వర్షాల మధ్య ఎడబాటు కారణంగా ఆలస్యంగా వరి నాట్లు వేసిన రైతులు తెగుళ్ల బెడదతో ఇబ్బంది పడుతున్నారు.



సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలతో నీటమునిగిన పత్తి చేను

తొలకరి ఆలస్యం

జూన్ రెండో వారం నుంచి తొలకరి వర్షాలు కురుస్తాయని విత్తనాలు వేసుకునేందుకు రైతులు ఎదురు చూశారు. నెలాఖరులో రుతు పవనాలు జిల్లాను తాకినా ఆశించిన మేర వర్షాలు పడలేదు. జూలై 18 నుంచి 27వరకు ఎడతెరిపి లేని భారీ వర్షాలు ముంచెత్తాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటితో ప్రాజెక్టుల నుంచి దిగువ ప్రాంతానికి లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. దీంతో రైతులు పత్తి, కంది పంటలు వేసుకోగా, వరి నారు పోసుకున్నారు. మరోమారు పంటలకు కీలకమైన ఆగస్టులో ఆశించిన మేర వర్షాల్లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెప్టెంబర్ రెండో వారంలో భారీ వర్షాలు ముంచెత్తి పంటలు నీటమునిగాయి.

సాధారణ వర్షపాతం, కురిసింది(మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసింది	అధికం, లోటు (శాతంలో)
జన్నారం	1033.1	1246.1	21 అధికం
దండేపల్లి	911.9	1150.1	26 అధికం
లకెట్టిపేట	912.9	841.2	8 లోటు
హాజీపూర్	933.8	862	8 లోటు
కాసిపేట	883.6	1145.3	30 అధికం
తాండూర్	855.7	862.1	1 అధికం
భీమిని	984.6	903.6	8 లోటు
కన్నెపెల్లి	989.8	899.7	9 లోటు
వేమనపల్లి	970.2	1079.2	11 అధికం
నెన్నెల	933.1	848.8	9 లోటు
బెల్లంపల్లి	873	920.1	5 అధికం
మందమర్రి	889.1	1017.8	14 అధికం
మంచిర్యాల	937.9	964.3	3 అధికం
నస్పూర్	934.1	1028.3	10 అధికం
జైపూర్	967.4	1278.5	32 అధికం
భీమారం	940.2	1025.3	9 అధికం
చెన్నూర్	979.8	1234.6	26 అధికం
కోటపల్లి	961.5	1256.1	31 అధికం
జిల్లా సగటున	938.4	1031.3	10 అధికం

(జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30)

జిల్లాకు మరో కోర్టు మంజూరు

- న్యాయవాదులు, కక్షిదారులకు ఊరట
- అద్దె భవనంలోనే ఏర్పాటు..!

మంచిర్యాలక్రైం: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జిల్లాలు ఏర్పడ్డాయి. దీంతో అన్ని ప్రభుత్వ శాఖలు ఏ జిల్లాకు ఆ జిల్లాలో ఏర్పాటయ్యాయి. అదే వరుసలో జిల్లా ప్రజలకు న్యాయపరమైన సమస్యల్లో దూరభారం తగ్గించేందుకు అంచెలంచెలుగా పలు కోర్టులు ఏర్పాటవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 57 కోర్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతమైన మందమర్రిలో సివిల్ జడ్జి, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు మంజూరైంది. గతంలోనూ మందమర్రిలో కోర్టు ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయి. ప్రస్తుతం ప్రభుత్వమే మందమర్రిలో కోర్టు ఏర్పాటు చేస్తోంది. దీంతో కక్షిదారులు, న్యాయవాదులకు ఊరట లభించింది.

అద్దె భవనంలోనే..

జిల్లా కేంద్రంలో 2004లో కోర్టులు ఏర్పాటయ్యాయి. అప్పటి నుంచి ఏడు కోర్టులు ఏర్పడ్డాయి. వీటితోపాటు లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూర్‌తో కలిపి పది కోర్టులు ఉన్నాయి. మందమర్రికి మంజూరైన కోర్టుతో వాటి సంఖ్య 11కు చేరింది. ఇందులో జిల్లా కేంద్రంలోని ఏడు కోర్టులు అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. కోర్టు భవనాల నిర్మాణానికి అనేక స్థలాలు పరిశీలించారు. చివరికి నస్పూర్ శివారులోని 42సర్వేనంబరులో ఐదెకరాల స్థలం కేటాయించారు. భవనాలు నిర్మించాల్సి ఉంది. మందమర్రికి మంజూరైన కోర్టుకు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగించే అవకాశాలున్నాయి. కోర్టు సొంత భవనాలు నిర్మించాలని న్యాయవాదులు కోరుతున్నారు.

హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన డీసీపీ



మినీ స్టేడియంలో హెలిప్యాడ్ వద్ద డీసీపీ

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో శనివారం ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్, సీఐ వాసుదేవరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి భవన ప్రారంభోత్సవానికి వెళ్లే దారిలో అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు బ్రేక్

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- నిలిచిన ఎస్జీటీ బదిలీల ప్రక్రియ

మంచిర్యాలఅర్బన్: సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) బదిలీలపై హైకోర్టు స్టే విధించింది. పదోన్నతులు చేపట్టకుండా బదిలీలు చేపట్టడంతో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ప్రభుత్వ, లోకల్‌బాడీ ఎస్జీటీ, తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు పదోన్నతులు లేకుండానే బదిలీలకు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 3, 4న స్పౌజ్ పాయింట్లను తొలగించడం, జీవిత భాగస్వామి పాయింట్లు, డీఎస్సీ సంవత్సరానికి, ర్యాంకుల దిద్దుబాటు సంబంధించిన అప్పీలు, ఖాళీల సవరణలు, ఫిర్యాదులు, వివరాల అప్‌డేట్ గ్రీవెన్స్ ద్వారా అప్పీల్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 5న తుది సీనియారిటీ జాబితా ప్రదర్శించారు. శుక్రవారం వెబ్ ఆప్షన్ల ప్రక్రియ చేపట్టారు. జిల్లాలో ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న 618 మంది వెబ్‌ఆప్షన్‌లో నిమగ్నమయ్యారు. ఇంకోవైపు పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని ఎస్జీటీలు, ఉపాధ్యాయ సంఘాలు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో కోర్టుకు వెళ్లడం, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో వెబ్ ఆప్షన్లను అధికారులు నిలిపివేశారు.

బదిలీలు, పదోన్నతులకు ఆటంకాలు..

టీచర్ల పదోన్నతులు, బదిలీలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. జనవరిలో ప్రక్రియ ప్రారంభమై మార్చిలో ముగియాల్సి ఉండగా.. కొందరు కోర్టుకు వెళ్లడంతో ఏడు నెలల అనంతరం గ్రీన్ సిగ్నల్‌తో ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబర్ 3న ప్రారంభమైన పదోన్నతులు, బదిలీలు ఈ నెల 3న పూర్తి కావాల్సి ఉన్నా కోర్టు కేసులు, వివిధ కారణాల వల్ల అవాంతరాలు ఎదురయ్యాయి. పీజీ హెచ్‌ఎం బదిలీలు, స్కూల్ అసిస్టెంట్లకు పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు మాత్రమే సజావుగా సాగాయి. స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు పూర్తయి బదిలీలు జరుగగా.. భాషా పండితులు, పీఈటీ అప్‌గ్రేడ్ కారణంగా ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్లు తెలుగు, హిందీ, పీడీల బదిలీ చేపట్టలేదు. ఎస్జీటీలు పదోన్నతి పొందాలంటే టెట్ ఉత్తీర్ణులై ఉండాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే పదోన్నతుల ప్రక్రియ లేకుండా బదిలీ ప్రక్రియ చేపట్టింది. శుక్రవారం వెబ్ ఆప్షన్‌లు కొనసాగుతుండగా.. పదోన్నతులు ఇవ్వకుండా బదిలీలు చేయొద్దని ఈ నెల 19వరకు స్టే ఇవ్వడంతో నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల ఆదేశానుసారం బదిలీ ప్రక్రియ చేపడుతామని డీఈవో యాదయ్య తెలిపారు.

రిలీవ్ అయ్యేదెలా..!

బదిలీలతో ఎస్ఏ ఉపాధ్యాయులు సంబరపడినా వారి స్థానంలో మరొకరు వచ్చే వరకు పాఠశాల నుంచి రిలీవ్ చేయొద్దనే ఆదేశాలు నిరాశలోకి నెట్టాయి. దీంతో బదిలీ అయినట్లా..? కానట్లా అనేది ప్రశ్నలా మారింది.

- భీమిని మండలంలోని ఓ పాఠశాలకు చెందిన ఇద్దరు గణితం ఉపాధ్యాయులు ధర్మారావుపేట్ పాఠశాలకు బదిలీ అయ్యారు. వీరు పని చేస్తున్న పాఠశాలను ఎవరూ కోరుకోలేదు. దీంతో రిలీవ్‌కు నిబంధనలు అడ్డొస్తున్నాయి. ధర్మారావుపేట్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడు ముల్కల్ల పాఠశాలకు రాలేకపోయారు. ముల్కల్లలోని గణితం టీచర్ ఇంక్లైన్ పాఠశాలకు రాలేక.. ఇందారం పోలేక బదిలీ గొలుసు కదలకుండా పోతోంది.
- చెన్నూర్‌లోని బాబురావుపేట్‌లో విద్యార్థుల సంఖ్య లేక అక్కడి ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ ఇచ్చారు. ఆయన నల్లపోచమ్మవాడ పాఠశాలకు బదిలీ అయ్యాడు. కానీ విద్యా శాఖ అధికారులు రిలీవ్ చేయనట్లు తెలుస్తోంది. ఎంఈవోల నుంచి హెచ్‌ఎంల వరకు కారణాలు చూపుతూ రిలీవ్ చేయకపోవడంతో దాదాపు 50నుంచి 60శాతం ఉపాధ్యాయులు పాత స్థానాల్లో ఉండాల్సి వస్తోంది. ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు ఉన్న చోట ఒకరిని రిలీవ్ చేసే అవకాశం ఉన్నా కొందరు హెచ్‌ఎంలు జీవో పేరిట ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎట్టకేలకు ‘ఎత్తిపోతల’కు మోక్షం

- నేడు పడ్తనపల్లి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రాక
- సాగులోకి రానున్న దాదాపు పది వేల ఎకరాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ మేరకు ఎట్టకేలకు పడ్తనపల్లి ఎత్తిపోతల పథకానికి మోక్షం లభించింది. ఈ నెల ఏడున రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన జరుగనుంది. దీంతో మండల వాసుల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. దాదాపు 15 ఏళ్ల క్రితం చేపట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంతో హాజీపూర్ మండలంలోని ఆరు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. నిర్వాసితులకు పరిహారంతోపాటు పునరావాస కాలనీలు ఏర్పాటు చేశారు. వేలాది ఎకరాల సాగుభూములు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో నిండా మునిగిపోయాయి. మిగిలిన కొద్దిపాటి ఎకరాలకు సాగునీటి సమస్య ఉన్నా ఎలాగోలా రైతులు సాగు చేస్తూ వస్తున్నారు. సాగునీటి ఇబ్బందులను రైతులు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం ప్రకటన వచ్చింది. జూన్‌లో కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కావాల్సి ఉండగా పలు కారణాలతో వాయిదా పడుతూ ఇప్పుడు మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపనకు నోచుకుంది.

పూర్తయితే ఇలా..

తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి నదిపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది. జలయజ్ఞంలో భాగంగా అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేయగా 2008 జూలై 28న మంచిర్యాల–పెద్దపల్లి జిల్లాల మధ్య ఉన్న గోదావరినదిపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ శంకుస్థాపనకు బీజం పడింది. 62 గేట్లతో నిర్మాణం చేపట్టిన ప్రాజెక్ట్ దాదాపు రూ.4,950 కోట్లతో ఎనిమిదేళ్ల క్రితం పూర్తయ్యింది. ప్రాజెక్ట్ కింద 7,500 ఎకరాల సాగుభూములు ముంపునకు గురయ్యాయి. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి మున్సిపాలిటీలకు, పెద్దపల్లి–మంథని ప్రాంతాలతోపాటు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ (సుజల స్రవంతి) పథకం కింద నీటి సరఫరా జరుగుతోంది. ఎన్టీపీసీ, సింగరేణి పారిశ్రామిక అవసరాలకూ నీరు తరలుతోంది. ఇక గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. తాజాగా పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేయనుండగా.. ఒక టీఎంసీ నీటితో మండల రైతాంగానికి రెండు పంటలకు సరిపడా సాగునీరు అందనుంది. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కృషితో సీఎం కేసీఆర్ ఎత్తిపోతల పథకాన్ని రూ.80.50 కోట్ల నిధులతో చేపట్టనున్నారు. ఎత్తిపోతల ద్వారా నీటిని 42 కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువకు అనుసంధానం చేయనుండగా మండలంలోని 10 వేల ఎకరాల వరకు భూములు సాగులోకి రానున్నాయి.



ఎత్తిపోతల పథకం పూర్తయితే జలకళ సంతరించుకోనున్న కడెం కాలువ

నాయబ్ తహసీల్దార్లకు పోస్టింగులు, బదిలీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా రెవెన్యూ శాఖలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్, గిర్దావర్(ఆర్ఐ)లు 14మందికి నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించగా.. కలెక్టర్ బి.సంతోష్ శుక్రవారం వారికి ఆయా మండలాల్లో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటికే పనిచేస్తున్న నలుగురిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. దేవి లక్ష్మినారాయణను చెన్నూర్ నాయబ్ తహసీల్దార్ (ఎన్నికల విభాగం), నడిపెల్లి మధుసూదన్‌రావును మంచిర్యాల డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ) యూనిట్‌లో, గోవర్ధన్‌ను కన్నెపెల్లికి, మోతిరామ్‌ను మంచిర్యాల కలెక్టరేట్, శంకర్ టీఎస్‌సీఎస్‌సీ డీఎంగా, కవితను మంచిర్యాల కలెక్టరేట్‌కు, శ్రీనివాస్‌ను బెల్లంపల్లికి, శ్రీహరిని మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి, వరలక్ష్మిని భీమినికి, మాధవిని లక్సెట్టిపేటకు, అతిష్‌కుమార్‌ను మంచిర్యాల కలెక్టరేట్(ఎన్నికల విభాగం), కే.రాజయ్యను జిల్లా సివిల్ సప్లయ్ మంచిర్యాల, ఇప్పటికే తాండూర్‌లో నాయబ్ తహసీల్దార్ పనిచేస్తున్న మాధవిని మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి, బి.గోవింద్ చెన్నూర్ నుంచి వేమనపల్లికి, బి.సంతోష్‌ను వేమనపల్లి నుంచి చెన్నూర్, కమల్‌సింగ్‌ను మంచిర్యాల ఆర్డీవో కార్యాలయం నుంచి తాండూర్‌కు బదిలీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకో



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

బెల్లంపల్లి: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు శుక్రవారం స్థానిక కాంటా చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. అంతకు ముందు ఏఎంసీ ఏరియాలోని దీక్ష శిబిరం నుంచి కాంటా చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.18వేలు వేతనం చెల్లించాలని, ఉద్యోగ క్రమబద్ధీకరణ, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, నాయకులు గోమాస అశోక్, చల్లూరి దేవదాస్, శ్రీకాంత్, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, రాజేశ్వరి, అనురాధ, సుశీల, స్వప్న, మమత, వసంత తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన ఆస్పత్రి



చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో రూ.10 కోట్లతో నిర్మించిన ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఆధునిక హంగులతో నిర్మించిన భవనాన్ని శనివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. అనంతరం రూ.55 కోట్లతో నిర్మించనున్న రోడ్లు, దోభీఘాట్, ఇతర అభివృద్ధి పనులకు భూమి పూజ, మండలంలోని సుద్దాల వాగుపై నిర్మించిన వంతెన ప్రారంభిస్తారు. అంబేద్కర్ చౌరస్తాలో రోడ్‌షోలో ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమాల్లో మంత్రితోపాటు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పాల్గొంటారు.

క్లుప్తంగా

ఆర్మీకి సీవోఈ విద్యార్థి ఎంపిక



పవన్‌కళ్యాణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన తాళ్ల పవన్ కళ్యాణ్ ఆర్మీలో సోల్జర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైదులు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పవన్‌కళ్యాణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కాగా, పెద్దపల్లి జిల్లా తురకలకుంట గ్రామానికి చెందిన పవన్‌కళ్యాణ్ ఇంటర్మీడియెట్ ఎంపీసీలో 906 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పూదరి నగేశ్, పెరుగు తిరుపతి, ఉపాధ్యాయులు వామన్, రాకేశ్, కుమార్, రాజలింగు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గొడవకు కారణమైన ఒకరిపై కేసు

మంచిర్యాలక్రైం: గత నెల వినాయక నిమజ్జనంలో తలెత్తిన చిన్న గొడవ కత్తుల దాడికి దారి తీసింది. నిమజ్జనం మరునాడు ఈ గొడవతో రెండు గ్రూపులు కొట్టుకునే వరకు వెళ్లింది. ఇనుప రాడ్లు, క్రికెట్ బ్యాట్లతో దాడి చేసుకుని బీభత్సం సృష్టించారు. ఈ ఘటనలో రెండు వర్గాలవారు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు గొడవకు కారణమైన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి జిల్లా కేంద్రంలో ఓ గ్యాంగ్‌ను పెంచి పోషిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఇల్లు కూల్చిన వారిపై ఫిర్యాదు



కూల్చిన తన ఇంటిని చూపుతున్న బాధితుడు శివనారాయణ

తాండూర్: మండలంలోని బోయపల్లి గ్రామ శివారులోగల తన హోటల్, ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కొలిపాక శివనారాయణ తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం పోలీస్ ఉద్యోగి అయిన మాసాడి క్రాంతికుమార్, ల్యాండ్ సర్వేయర్ సత్యనారాయణ, నేషనల్ హైవే స్టాఫ్ దౌర్జన్యంగా తన రెయిన్‌బో హోటల్, ఇంటిని జేసీబీతో కూల్చారని ఆరోపించాడు. ఆ హోటల్ ద్వారానే తాను ఉపాధి పొందుతున్నట్లు తెలిపాడు. హోటల్, ఇల్లు కూల్చిన వారిపై కఠినచర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

నీటికుంటలు... నిండుకుండలు..!

- సత్ఫలితాలిస్తున్న నీటి కుంటలు
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- తీరుతున్న వన్యప్రాణుల దాహార్తి



నిండు కుండలా కల్పకుంట



తాళ్లపేట్ రేంజ్‌లో నిండుగా నీటి కుంట

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌కు గుండెకాయ లాంటిది జన్నారం అటవీ డివిజన్. విస్తీర్ణంలో చిన్నగా ఉన్నా.. అత్యధిక వన్యప్రాణులు ఇక్కడే అవాసం ఏర్పరుచుకున్నాయి. నీలుగాయిలు, సాంబర్లు, చుక్కల దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, ముళ్లపందులు, కృష్ణ జింకలు, అడవి కుక్కలు ఇలా రకరకాల వన్యప్రాణులు జన్నారం అటవీ డివిజన్‌లో కనిపిస్తాయి. వన్యప్రాణులకు వేసవిలో దాహం తీర్చేందుకు గతంలో సాసర్ వెల్‌లు, నీటి తొట్లు ఏర్పాటు చేసేవారు. వాటిలో వేసవిలో ట్రాక్టర్ల ద్వారా నీటిని పోసేవారు. ఇది వన్యప్రాణులకు ఇబ్బందిగా మారింది. దీంతో అటవీ అధికారులు వినూత్నంగా ఆలోచించారు. వేసవిలోనూ అటవీ ప్రాంతంలో నీరుండేలా ఆలోచించి నీటి కుంటల తవ్వకాలు చేపట్టారు. వీటితో వేసవిలో వన్యప్రాణులు దాహం తీర్చుకుంటుండగా భూగర్భజలాలు పెరిగాయి.

మూడేళ్లలో 240 కుంటలు..

జన్నారం అటవీ డివిజన్‌లో గతంలో 100 నీటి కుంటలుండేవి. మాధవరావు ఎఫ్‌డీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు పలు రకాల ప్రయత్నాలు చేశారు. చివరికి వానాకాలంలో నీరు వృథా పోకుండా ఎక్కడికక్కడే నీటి కుంటల నిర్మాణం చేయాలని ఆలోచించారు. డివిజన్‌లో మూడేళ్లలో ఉపాధిహామీ పథకం కింద కొత్తగా 240 నీటి కుంటలు నిర్మించారు. వీటితోపాటు ట్రెంచ్‌ల తవ్వకాలు చేపట్టారు. దీంతో వానాకాలంలో వరదనీరు చేరి నీటి కుంటలు నిండు కుండల్లా మారాయి. వానాకాలంలో నీటికి అడ్డుకట్టలు వేస్తూ ఒడిసి పట్టడం ద్వారా వేసవిలో వీటి ఫలితాలు కనిపిస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

పెరిగిన భూగర్భ జలాలు

అడవుల్లో నీటిని ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. రెండేళ్లుగా ట్యాంకర్లతో నీటిని పోసే పద్ధతికి స్వస్తి పలికారు. గతంలో మాదిరిగా సాసర్‌వెల్, నీటి తొట్లు ఏర్పాటు చేయడం.. అందులో నీరు పోయడం లాంటి చర్యలు మానేశారు. వేసవిలో ర్యాంప్ వెల్‌లు నిర్మించారు. సహజసిద్ధంగా భూమి నుంచి నీరు ఊరేలా ర్యాంప్ వెల్‌లను తవ్వించారు. అందులోకి వన్యప్రాణులు దిగి నీరు తాగేందుకు వీలుగా ర్యాంప్‌లా ఏర్పాట్లు చేశారు. వీటిని బట్టి చూస్తే నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

నీరు పోసే విధానానికి స్వస్తి చెప్పాం



వేసవిలో నీటి సమస్య ఏర్పడి వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా సాసర్ వెల్‌లలో ట్యాంకర్ల ద్వారా నీరు పోసే పద్ధతి ఉండేది. నూతనంగా ఆలోచించి భూగర్భ జలాలను పెంచితే వేసవిలో సహజసిద్ధమైన నీటిని అందించవచ్చని నీటి కుంటల నిర్మాణం చేపట్టాం. దీని ద్వారా వేసవిలో భూగర్భ జలాలు పెరగడంతో ర్యాంప్‌వెల్, ఊట కుంటలు తవ్వించి సహజ సిద్ధమైన నీటిని వన్యప్రాణులకు అందిస్తున్నాం.

– సిరిపురం మాధవరావు, డిప్యూటీ కన్జర్వేటర్

70 చోట్ల ఊట కుంటలు

వేసవిలో కొన్ని నీటి కుంటలు ఎండిపోయినా ఊట కుంటలతో నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. డివిజన్‌లో 70 చోట్ల ఊట నీటితో కుంటలు ఏర్పాటు చేశారు. వేసవిలో ఇక ట్యాంకర్‌తో నీరు నింపాల్సిన అవసరం లేకుండా తగు చర్యలు చేపడుతున్నారు. నూతన టెక్నాలజీని ఉపయోగించి నీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

స్వచ్ఛ ఆటోడ్రైవర్లకు పెండింగ్ వేతనాలు అందజేత



చెక్కు అందజేస్తున్న బాల్క సుమన్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న స్వచ్ఛ ఆటోడ్రైవర్లకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలకు సంబంధించిన రూ.18.50 లక్షల చెక్కును శుక్రవారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అందజేశారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలని 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి పెండింగ్ వేతనాలు మంజూరు చేయించారు. డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తూ 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

డిస్మిసల్ కార్మికులకు అవకాశం

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థలో కొంతకాలం పని చేసి 1.1.2019 నుంచి 31.12.2022 లోపు డిస్మిస్ అయిన కార్మికులను పలు షరతులతో తిరిగి ఉద్యోగంలోకి తీసుకోనున్నట్లు ఏరియా జీఎం మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగం కావాలనుకునే వారు పనిచేసిన గనులు, డిపార్ట్‌మెంట్లపై అధికారులను కలిసి ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంస్థ అందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని జంతువు మృతి



మృతి చెందిన నక్కలాంటి జంతువు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వైపు వెళ్లే రోడ్డు మలుపు వద్ద జాతీయ రహదారి పక్కన గురువారం రాత్రి ఓ గుర్తు తెలియని అటవీ జంతువు మృతి చెందింది. వివరాలు.. గుడిపేట జాతీయ రహదారి పక్కన రాత్రి ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో నక్కను పోలి ఉన్న ఓ అటవీ జంతువు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సమాచారం అటవీ బీట్ అధికారి దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి స్పందన రాలేదు. అటవీ జంతువు మృతిపై కనీసం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించాల్సి ఉండగా.. అధికారులు ఫొటోలు చూసి నక్క, తోడేలు లాంటి జాతికి చెందిన జంతువు కాదని, అది ఒక కుక్క అని నిర్ధారణకు రావడంతో అంతా విస్తుపోతున్నారు. రాత్రి వరకు కూడా ఘటనా స్థలికి రాకపోవడంతో దాని కళేబరం అక్కడే ఉన్నది. రోజూ గస్తీలో ఉంటున్నామని చెబుతున్న అటవీ అధికారులు, సిబ్బంది ఓ అరుదైన జంతువు రోడ్డు పక్కనే చనిపోయి ఉందని తెలిసినా స్పందించక పోవడం శోచనీయమని పలువురు పేర్కొంటున్నారు. కాగా, స్థానికులు మాత్రం చనిపోయింది తోడేలు లాగా ఉందని చర్చించుకున్నారు.

గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్ట్



పట్టుబడ్డ గంజాయి, నిందితుడు

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన షేక్ షాహిద్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నాడని అందిన సమాచారం మేరకు అతడు వెళ్తున్న ఆటోను పోలీసులు తనిఖీ చేశారు. అందులోని రూ.2,500 విలువైన కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. షాహిద్‌ను పట్టుకుని విచారించగా గోదావరిఖనిలోని తెలిసిన వారికి విక్రయించేందుకు వెళ్తున్నట్లు తెలిపాడు. విచారణ కోసం అతడితోపాటు గంజాయిని సీసీసీ నస్పూర్ పోలీసులకు అప్పగించారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరి మృతి

మంచిర్యాలక్రైం: మద్యం మత్తులో స్థానిక హమాలీవాడ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో కిందపడిన వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీవాడకు చెందిన మల్యాల రామకృష్ణ (40) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. ఈ నెల 5న పనికి వెళ్తున్నాని ఇంటినుంచి వెళ్లాడు. మద్యం సేవించి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో కిందపడ్డాడు. తలకు దెబ్బతగిలిందని స్థానికులు రామకృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి రామకృష్ణ కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే ఆయన మృతిచెందాడు. రామకృష్ణకు భార్య శారద, కూతురు ప్రశాంతి ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

తిర్యాణి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై చుంచు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మందగూడ గ్రామపంచాయతీ పరిధి చింతల మాదర గ్రామానికి చెందిన ఆత్రం కృష్ణ (19) గత నెల 28న సాయంత్రం పని నిమిత్తం స్వగ్రామం నుంచి తిర్యాణి వైపునకు తన ద్విచక్రవాహనంపై అతివేగంగా వెళ్తున్నాడు. సాలేగూడ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను గమనించకపోవడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఆపి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృష్ణ తల, కాలికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి నాగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన మహిళ..

మంచిర్యాలక్రైం: విద్యుత్ షాక్ తగిలిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాత గర్మిళ్లలో నివాసముంటున్న సిద్దం అనూష (25) గత నెల 28న ఇంటి వద్ద ఉతికిన బట్టలు ఇనుపరాడ్‌పై ఆరవేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయింది. వెంటనే స్థానిక మెడిలైఫ్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి గత నెల 30న తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. అనూషకు భర్త లక్ష్మణ్‌తోపాటు కూతురు ఉంది. మృతురాలి తండ్రి బద్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సోలార్ విద్యుత్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ వన్ ఇంక్లైన్ గని ఆవరణలో త్వరలో ప్రారంభించనున్న 27.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ స్థలాన్ని, చెన్నూర్ టూ ఇంక్లైన్ గని ఆవరణలో 11 మెగా వాట్ల సోలార్ విద్యుత్ పనులను శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి విద్యుదుత్పత్తిని ప్రారంభించాలని, దానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్ ఆనంద్‌కుమార్, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గుండె రావు, ఏరియా వర్క్‌షాప్ ఎగ్జిక్యూటివ్ రాకేశ్ తదితరులున్నారు.

'గుర్తింపు' ఎన్నికలకు నామినేషన్లు షురూ

శ్రీరాంపూర్: సింగరేణిలో ఏడో దఫా గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ మొదలైంది. శుక్రవారం నామినేషన్ల ప్రకియ ప్రారంభమైంది. శనివారం నామినేషన్లకు చివరిరోజు. ఈ నెల 9వ తేదీన ఉపసంహరణ ఉంటుంది. మొదటి రోజు పలు కార్మిక సంఘాల నాయకులు నామినేషన్ వేశారు. ప్రధాన సంఘాల్లో ఏఐటీయూసీ, హెచ్‌ఎమ్మెస్, బీఎంఎస్, సీఐటీయూ, ఐఎన్టీయూసీ సంఘాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న డెప్యూటీ సీఎల్సీ శ్రీనివాసులకు నామినేషన్లు అందించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య, హెచ్‌ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా, టీబీజీకేఎస్ నాయకులు రేపు నామినేషన్ వేయనున్నారు.

హాకీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో శుక్రవారం ఏరియా స్థాయి హాకీ పోటీలు నిర్వహించారు. ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో కేకే, ఎస్కే గ్రూపు జట్లు గెలుపొందగా, కాసిపేట-1, కాసిపేట-2 జట్లు రన్నర్‌గా నిలిచాయి. కంపెనీ లెవెల్‌లో పోటీల్లో ఏరియా జట్టు రాణించాలని ఎస్వోటూ జీఎం ఆకాంక్షించారు. కార్తీక్, రవికుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: కంపెనీ స్థాయిలో జరిగిన బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బహుమతులు సాధించిన క్రీడాకారులను ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి అభినందించారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఇల్లందులో కంపెనీ స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీరాంపూర్ నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొని బహుమతులు సాధించారు. బాడీ బిల్డింగ్ 75 కిలోల కేటగిరీలో లక్ష్మణ్ (సపోర్ట్‌మన్, ఎస్సార్పీ-1) ప్రథమ స్థానం, 55 కిలోల విభాగంలో సుధాకర్ (జనరల్ మజ్దూర్ ఆర్కే-7) ద్వితీయ స్థానం, 90 కిలోల విభాగంలో రమేశ్ (ఓవర్‌మెన్, ఆర్కే-7) ద్వితీయ స్థానంలో నిలిచారు. వెయిట్ లిఫ్టింగ్ 81 కిలోల విభాగంలో అజయ్ (జనరల్ మజ్దూర్, ఆర్కే న్యూటెక్) ప్రథమ స్థానం, పవర్ లిఫ్టింగ్‌లో 74కిలోల విభాగంలో ఎస్కే ఇమ్రాన్ (జనరల్ మజ్దూర్ ఆర్కే-6) ద్వితీయ స్థానం, 104 కిలోల విభాగంలో రంజిత్‌కుమార్‌రెడ్డి (జనరల్ మజ్దూర్, ఆర్కే-7) ద్వితీయ స్థానం, 84కిలోల విభాగంలో కుమారి ప్రియాంక (పర్సనల్ డిపార్ట్‌మెంట్, శ్రీరాంపూర్) ద్వితీయ స్థానం, 47కిలోల విభాగంలో కుమారి నవ్య (జనరల్ మజ్దూర్, పర్సనల్ డిపార్ట్‌మెంట్, శ్రీరాంపూర్) ద్వితీయ స్థానం సాధించారు. వీరిని జీఎం కార్యాలయంలో శుక్రవారం జీఎం సంజీవరెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు. కంపెనీ స్థాయి పోటీల్లో ఏరియా ప్రతిష్టను నిలిపారని కొనియాడారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి, ఏరియా ఎస్వోటూ జీఎం కే రఘుకుమార్, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు ఎం.శ్రీనివాస్, డీజీఎంలు చిరంజీవి, రాజేశ్వర్‌రావు, స్పోర్ట్స్ కార్యదర్శి పాలకుర్తి రాజు, న్యూటెక్ సంక్షేమాధికారి స్పజన్‌పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల రిలే దీక్ష ప్రారంభం



దీక్ష శిబిరంలో కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో దీక్ష ప్రారంభించారు. మొదటిరోజు జీఎం కార్యాలయం ప్రధాన గేటు ఎదుట ధర్నా చేశారు. అనంతరం జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాల నుంచి కనీస వేతనాల జీవోను సవరించడం లేదని తెలిపారు. కోలిండియాలో ఇస్తున్నట్లుగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 22ను ప్రభుత్వం విడుదల చేసి సంవత్సరమైనా గెజిట్ చేసి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. దీంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గట్టు మహేందర్, డివిజన్ కార్యదర్శి వేల్పుల కుమారి, అధ్యక్షురాలు కళావతి, నాయకులు స్వరూప, నాగరాజు, సాయి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 13 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో జీఎం మనోహర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో గతంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం యువతకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న వారిలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 13మంది ఎంపికయ్యారు. శుక్రవారం వీరు ఏరియా జీఎం ఆఫీస్‌లో జీఎం మనోహర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ ఎంతో మేలు చేసిందని సంతోషం వ్యక్తంజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.. సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువత కోసం సింగరేణి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రోత్సహిస్తోందని తెలిపారు. 13మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వంగా ఉందని, ఎంపికైనవారు ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అధికారులు, ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళా రిజర్వేషన్‌పై హామీ వచ్చేదాకా పోరాటం


పాతమంచిర్యాల: మహిళా రిజర్వేషన్‌లో బీసీ మహిళల వాటా ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదారి చంద్రమోహన్, గౌరవాధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఎంపిక ఫలితాల్లో బీసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో 5శాతం జనాభా లేని ఓసీలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడంతో బీసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌చారి, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు మోహనకృష్ణ, శేఖర్, రాజేశ్, వంశీ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'మధ్యాహ్నం' తంటా!

- ఇంటినుంచే టిఫిన్‌బాక్స్‌లు తెచ్చుకుంటున్న విద్యార్థులు



హరిజనవాడ స్కూల్ ఎదుట ఖాళీ కంచాలతో నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు



హరిజనవాడ, స్టేషన్‌రోడ్, రాళ్లపేట్ స్కూల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల్లో వంట చేసే కార్మికులు ఆందోళన బాట పట్టగా మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటుండగా.. మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే తాత్కాలిక వంట మనిషితో వంట చేయిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఏ-1 పరీక్షలు జరుగుతుండటంతో ఉదయం వచ్చే విద్యార్థులు ఇంటికి వెళ్తుండటం.. మధ్యాహ్నం వచ్చే విద్యార్థులు ఇంట్లోనే తినివస్తుండటంతో కాస్త ఊరట కలిగిస్తోంది. కొన్ని హైస్కూళ్లలో మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులు చేస్తుండగా.. కొన్నింట్లో ఉపాధ్యాయులే తాత్కాలిక వంటమనుషులను ఏర్పాటు చేసుకున్నారు. ప్రైమరీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటినుంచే లంచ్ బాక్స్‌లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంఈవో కార్యాలయ ఆవరణలోనే ఉన్న స్టేషన్ రోడ్, హరిజనవాడ, రాళ్లపేట్ స్కూల్‌ను 'సాక్షి' పరిశీలించింది. 45మంది విద్యార్థుల్లో ఎక్కువ మంది ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తిన్నారు. ఇంకోవైపు ఈ పాఠశాల (ఎంఈవో ఆఫీస్) ఎదుట వంటకార్మికులు నిరసన తెలిపారు.

ఖాళీ ప్లేట్లతో వంటకార్మికుల నిరసన

డిమాండ్లు నెరవేర్చాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం మంచిర్యాల ఎంఈవో కార్యాలయం ఎదుట ఖాళీ కంచాలు ప్రదర్శిస్తూ వంట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడుతూ.. కొత్త మెనూ, కోడిగుడ్డుకు అదనపు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదని పేర్కొన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.